క్లుప్తంగా

వీడ్కోలు హంగామా



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఇంటర్మీడియట్ సెకండియర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం హాజరయ్యారు. అనంతరం విద్యార్థుల చేసిన నృత్యాలు అలరించాయి. కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్‌నాయక్, సిరిసిల్ల కళాశాల ప్రిన్సిపాల్ విజయ రఘునందన్‌రావు, సెస్ డైరెక్టర్ నారాయణరావు, మాజీ జెడ్పీటీసీ నర్సాగౌడ్ పాల్గొన్నారు. దమ్మన్నపేట మోడల్ స్కూల్‌లో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి.

పేదల ఇంటికి ఇసుక చేరాలి

ఎల్లారెడ్డిపేట: మండలంలో ఇల్లు నిర్మించుకునే పేదలకు ఇసుక చేరాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య కోరారు. స్థానిక పార్టీ ఆఫీస్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. టిప్పర్ల ద్వారా చేసే అక్రమ ఇసుక సరఫరాను పోలీసులు అడ్డుకోవాలని కోరారు. పేదల ఇంటి నిర్మాణానికి ఇసుక కోసం తమ నాయకులను సంప్రదిస్తే ఇసుక కూపన్లు ఇప్పిస్తారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు షేక్ గౌస్, లింగంగౌడ్, గిరిధర్‌రెడ్డి, వంగ మల్లారెడ్డి, రొడ్డ రామచంద్రం, ఎండీ రఫీక్, సూడిద రాజేందర్, అనవేని రవి, బుచ్చగౌడ్, చెన్నిబాబు, కొత్తపల్లి దేవయ్య, ఎండీ ఇమామ్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

ఎల్లారెడ్డిపేట: గ్రామ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎంపీడీవో, ప్రత్యేకాధికారి సత్తయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారిగా మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. సత్తయ్యను కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. గ్రామంలో సమస్యలను తమదృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి, నాయకులు శ్రీని వాస్‌గౌడ్, గుర్రపు రాములు, వెంకటేశ్‌గౌడ్, అంజయ్య, సంతోష్, చందు, తిరుపతి, అనిల్, బాల్‌రెడ్డి, ధర్మేందర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం



బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కోరెంలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. కల్యాణం తిలకించేందుకు ప్రజలు అధికసంఖ్యలో హాజరయ్యారు. ధ్వజస్తంభం వద్ద గరుడ ముద్దలు ఎగురవేసే కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ చెన్నాడి సుధాకర్‌రావు, రాజ్యలక్ష్మీ, సింగిల్‌విండో చైర్మన్ తీపిరెడ్డి కిషన్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం



తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలానికి ఇటీవల ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన కె.ప్రశాంత్ రెడ్డిని మండలానికి చెందిన పలువురు నాయకులు కలిశారు. ఎస్సైని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

సంత్ సేవాలాల్ జయంతి

కోనరావుపేట: మండలంలోని అజ్మీరాతండాలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు నిర్వహించారు. గ్రామంలో భోగ్ భండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేడుకలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. వేడుకల్లో లైవ్ జిల్లా అధ్యక్షుడు బానోత్ నరేశ్‌కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఫిరోజ్‌పాషా, పెంత శ్రీనివాస్, గిరిజన నాయకులు పాల్గొన్నారు. నిమ్మపల్లిలో ఇటీవల చిలుక వరుణ్ అనే విద్యార్థి మృతిచెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

నిత్యావసరాలు అందజేత

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని డే కేర్ వృద్ధుల సంక్షేమ కేంద్రంలోని వృద్ధులకు సామాజిక కార్యకర్త భగవత్ మంగళవారం నిత్యావసర వస్తువులు అందజేశారు. 15 రోజులకు సరిపడా బియ్యం, కూరగాయలు, పప్పు దినుసులు అందించారు. ఎంపీటీసీ పందిర్ల నాగరాణి, నాయకులు పర్శరాములు, శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య చిత్రపటాల పంపిణీ

ముస్తాబాద్: మండలకేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో అయోధ్య రాముని చిత్రపటాలను బీజేపీ నాయకులు మంగళవారం ఇంటింటా పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు మెరుగు అంజాగౌడ్, నాయకులు శ్రీని వాస్‌రావు, సంతోష్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

సమీకృత మార్కెట్ నిర్మాణమెప్పుడో?

- మండలకేంద్రంలో పాత మార్కెట్ యార్డును కూల్చిన అధికారులు
- ప్రత్యేక మార్కెట్ యార్డు లేక రోడ్డుపైనే కూరగాయల విక్రయం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మండలకేంద్రంలో రోడ్డుపైనే కూరగాయల విక్రయం

గంభీరావుపేట: మండలకేంద్రంలో రోజువారీ కూరగాయల సంతలో క్రయ విక్రయదారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గంభీరావుపేట, నర్మాల, దేశాయిపేట, ముస్తఫానగర్, పొన్నాలపల్లె, జిల్లెల్లపల్లె, దమ్మన్నపేట, నాగంపేట, లింగన్నపేట తదితర గ్రామాల నుంచి ప్రజలు కూరగాయలు, ఇతర నిత్యావసరాల కోసం నిత్యం ఇక్కడి మార్కెట్‌కు వస్తుంటారు. ఏళ్లుగా మార్కెట్‌కు మహర్దశ రావడం లేదు. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ కూరగాయల విక్రయిస్తున్నారు. ప్రత్యేక మార్కెట్ యార్డు లేకపోవడంతో రోడ్డుపైనే మార్కెట్ కొనసాగుతోంది. దీంతో ఉదయం పూట ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు. విక్రయదారులు తాత్కాలిక నీడ కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎండవేడికి ఇటు కొనుగోలుదారులు, అటు విక్రయదారులు తల్లడిల్లుతున్నారు. మార్కెట్‌లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దూరప్రాంతాల నుంచి వచ్చేవారు తాగునీరు లేక దాహంతో తల్లడిల్లుతున్నారు. ఏటా రూ.లక్షల్లో తైబజార్ ద్వారా గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూరుతున్నా మార్కెట్ అభివృద్ధికి కేటాయించడం లేదు. మార్కెట్‌లో తాగునీటి సౌకర్యం, ప్రత్యేక టాయిలెట్స్ లేవు. బస్టాండ్‌లోని పబ్లిక్ టాయిలెట్స్‌కు వెళ్తున్నారు. రోజూ ఉదయం 6నుంచి సాయంత్రం 7 గంటల వరకు మార్కెట్ కొనసాగుతోంది. కూరగాయలతో పాటు నిత్యావసర వస్తువులు, సీజన్‌లో లభించే పండ్లు వంటివి మార్కెట్‌లో లభ్యమవుతుంటాయి. దీంతో నిత్యం వందలాది మంది మార్కెట్‌కు వస్తుంటారు.

పాతది కూల్చి..కొత్తది మరిచారు

రూ.లక్షలాది రూపాయలతో కొత్తగా సమీకృత మార్కెట్ యార్డు నిర్మిస్తామని గత గ్రామపంచాయతీ పాలకవర్గం గతంలో నిర్మించిన షెడ్లు, పాత గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని కూల్చేశారు. జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపికైన సందర్భంగా వచ్చిన నగదు ప్రోత్సాహంతో ఆధునిక హంగులతో సమీకృత మార్కెట్ నిర్మిస్తామని, అప్పటి మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ సమీకృత మార్కెట్ కోసం భూమిపూజ చేశారు. అంతలో ఎన్నికలు రావడంతో పాటు ప్రభుత్వం కూడా మారింది. గ్రామ పంచాయతీ పాలకవర్గ పదవీకాలం ముగిసింది. కానీ మార్కెట్ పరిస్థితి మాత్రం ఎ క్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది.

సౌకర్యాలు కల్పించాలి



రోజువారీ మార్కెట్‌కు చుట్టుపక్క గ్రామాల నుంచి ప్రజలు తరచూ వస్తుంటారు. ఇక్కడ కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విక్రయదారులకు నిలువ నీడ లేక అవస్థలు పడుతున్నారు. అధికారులు తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి.

– దేవసాని కృష్ణ, గంభీరావుపేట

ప్రత్యేక దృష్టి సారించాలి



ఏళ్లుగా కూరగాయల మార్కెట్ గాంధీ ఏరియాలో కొనసాగుతోంది. ఇది అన్నిగ్రామాల ప్రజలకు అనుకూలంగా ఉంది. మార్కెట్‌ను ఆధునీకరించి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి. తాగేందుకు నీరు కూడా లేదు. అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలి.

– రాగిశెట్టి నారాయణ, గంభీరావుపేట

ఉద్యోగుల సేవలు మరువలేనివి



బదిలీపై వెళ్తున్న ఎంపీడీవోను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

వేములవాడరూరల్: ఉద్యోగుల సేవలు ఎల్లప్పుడు గుర్తుండిపోతాయని ఎంపీపీ బండ మల్లేశంయాదవ్ అన్నారు. వేములవాడ రూరల్ ఎంపీడీవోగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో రాంరెడ్డికి మండల పరిషత్ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను తన పదవీకాలంలో ఆయన సమర్థవంతంగా నిర్వహించారన్నారు. ఇన్ని రోజులు తనకు సహకరించిన వారికి ఎంపీడీవో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నూతనంగా బదిలీపై వచ్చిన ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ రమేశ్ మాట్లాడారు. కార్యక్రమానికి మండలంలోని అన్నిగ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

కోనరావుపేట: మండలంలోని మల్కపేటలో పోచమ్మ ఆలయ అభివృద్ధికి మాజీ సర్పంచ్ ఆరెలత మహేందర్ దంపతులు రూ. 50,116 అందజేశారు. జవ్వాజి ఎల్లాగౌడ్-కవిత దంపతులు గుడి గోపురంపై నుండే కలశం, మంకు మధుకర్ రూ.15,116 అందజేశారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, మాజీ ఉపసర్పంచ్ జవ్వాజి అంజయ్య, ఎల్లాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. కొలనూర్‌లో పోచమ్మ ఆలయ పునర్నిర్మాణం కోసం సంకినేని వేణుమాధవ్ రూ.10,116 అందజేశారు. సంకినేని చొక్కారావు రూ. 11, 116 అందజేశారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు..

మండలంలోని సుద్దాలలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం కుల సంఘాల నాయకులు విరాళాలు అందజేశారు. గ్రామాల్లో ఇటీవల చోరీలు ఎక్కువ జరుగుతుండగా గ్రామంలోని కులసంఘాల నాయకులు రూ.2లక్షల విరాళాలు సేకరించారు. వీటిని ఎంపీటీసీ కాశవేని మమత మహేశ్‌కు అందజేశారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

కోనరావుపేట: విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎస్సై ఆంజనేయులు అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలను మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు కళాశాలకు జిల్లాస్థాయిలో గుర్తింపు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ బైరి భూమేశ్, అధ్యాపకులు సుధాకర్, శ్రీనివాస్, రూప్లీలక్ష్మి, ప్రసాద్, కనుకయ్య, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

- **ఎంపీడీవోను సన్మానించిన నాయకులు**

బోయినపల్లి: నూతన ఎంపీడీఓ బీమా జయశీలను మంగళవారం యువజన సంఘాల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా యువజన సంఘాల అధ్యక్షుడు అమిరిషెట్టి భూంరెడ్డి, జిల్లా ఉత్తమ యూత్ అవార్డీ నల్లాల రాజేందర్, యువకులు అక్కెనపెల్లి లింగయ్య, శేఖర్, కోలాపూర్ చిరంజీవి, సతీశ్, రాజలింగం తదితరులు ఉన్నారు.

- **ఎంపీపీకి ఆహ్వానం**

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం గాలిపెల్లి ఈతరం యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24, 25న ఉమ్మడి కరీంనగర్ జిల్లా గ్రామీణ స్థాయి కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనుండగా ఎంపీపీ వుట్కూరి వెంకటరమణా రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. వైస్ ఎంపీపీ సుధగోని శ్రీనాథ్ గౌడ్, యువజన సంఘం సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

- **మహిళలకు సన్మానం**

తంగళ్లపల్లి: బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శక్తి వందన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు మహిళలను శాలువాతో సత్కరించి ఆయోధ్య రామాలయ మందిర చిత్రపటాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ స్టేట్ మెంబర్ శోభారెడ్డి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

- **యువత క్రీడల్లోనూ రాణించాలి**

తంగళ్లపల్లి: మండలంలోని సారంపల్లిలో జరుగుతున్న మెగా క్రికెట్ టోర్నీని మంగళవారం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బొల్లి రాంమోహన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులతో క్రికెట్ ఆడారు. టోర్నీ ముగిసిన తర్వాత విన్నర్ జట్టుకు రూ.6 వేలు, రన్నర్ జట్టుకు రూ.4 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. మాజీ సర్పంచ్ రమేశ్, నాయకులు అబుబకార్, అమర్ రావు, రమేశ్, రాజేశ్వరరావు, జీవన్, మహేశ్, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

- **సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం**

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తెలంగాణ శాసనసభలో సమగ్ర కుల జనగణన తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదించినందుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు మంగళవారం మండల కేంద్రంలో క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ప్రతినిధి పసుల వెంకటి, ఫిషరీస్ చైర్మన్ జెట్టి మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

- **నీటి విడుదలపై హర్షం**

తంగళ్లపల్లి(సిరిసిల్ల): దాచారం కాలువద్వారా నీటిని మంగళవారం అధికారులు విడుదల చేసినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు బెంద్రం తిరుపతి రెడ్డి తెలిపారు. రైతులు ఇటీవల ధర్నాలు, రాస్తారోకో చేయగా ఇచ్చిన మాట ప్రకారం నీటి విడుదలకు సహకరించిన రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్ అధికారులకు రైతుల పక్షాన ధన్యవాదాలు తెలిపారు.

- **ఆర్థికసాయం అందజేత**

వేములవాడ: పట్టణంలోని సాయినగర్‌లో నివాసముంటున్న హారిక కుటుంబానికి రూ.10వేలను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈనెల 29న హారిక వివాహం జరగనుండగా ఆమె తల్లిదండ్రులకు ఆర్థిక సాయాన్ని కాంగ్రెస్ నాయకులు అందజేశారు.

- **విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం**

కోనరావుపేట: మండలంలోని మల్కపేటలో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. గ్రామంలో శిథిలమైన నూతన ఆలయాన్ని పునర్నిర్మించారు. ఈ సందర్భంగా గణపతిపూజ, పుణ్యాహవచనం, జలాధివాసం, క్షీరాధివాసం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. 23న సారగమ్మ బోనాలు, 25న పోచమ్మ బోనాల కార్యక్రమాలు ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రక్తహీనతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

వేములవాడరూరల్: వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రక్తహీనతపై అవగాహన కల్పించారు. ముక్త భారత్‌లో భాగంగా వైద్యులు పావని, లహరిక విద్యార్థినులను పరీక్షించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి అంజయ్య, ఫార్మసిస్ట్ గౌస్, ఏఎన్ఎం సౌజన్య పాల్గొన్నారు.

విష్ణు సహస్రనామ పారాయణం చేయాలి

ఎల్లారెడ్డిపేట: భీష్మ ఏకాదశి నాడు అఖండ విష్ణు సహస్రనామ పారాయణం చేస్తే మానసిక ప్రశాంతత కలుగుతుందని సత్సంగ సదనం అధ్యక్షుడు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సత్సంగ సదనంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో లక్ష్మారెడ్డి మాట్లాడారు. రామనామంతో సత్సంగ సదనం మారుమోగింది. సత్సంగ సదనం ప్రతినిధులు లక్ష్మమ్మ, సంజీవ రెడ్డి, మల్లారెడ్డి, గుండం రాజిరెడ్డి, అనంతరెడ్డి, రామిరెడ్డి, బండారి బాల్‌రెడ్డి, మేగి నర్సయ్య, రేవూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సారవంతమైన భూమితోనే పంట దిగుబడి



వేములవాడరూరల్: సారవంతమైన భూమిలోనే పంట దిగుబడి వస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ అన్నారు. వేములవాడ రూరల్ మండలం పోచెట్టిపల్లి, అచ్చన్నపల్లి గ్రామాల్లోని రైతుల భూములను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే పొలాలు చౌడు భూములుగా మారుతున్నాయన్నారు. ఏఈవో అనూష, ఆయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలకేంద్రంలోని మానేరు నదిలో ఇసుకను ఇష్టానుసారం తోడేస్తున్నారు. అధికారులు చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. తంగళ్లపల్లి గ్రామస్తులకు మానేరు వాగులోని గచ్చుబావి ద్వారా నీరు అందిస్తున్నారు. అయితే బావిచుట్టూ ఇసుకను తవ్వేస్తుండడంతో బావి ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. వేసవిలో బావిలో నీరు అడుగంటితే గ్రామస్తులకు నీటి సరఫరా నిలిచే అవకాశ ముందని అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామపంచాయతీ అధికారులు వాపోతున్నారు.

ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

గంభీరావుపేట: మండల ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్శ హన్మాండ్లు సమక్షంలో ఎన్నిక నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా చాత్రబోయిన లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా పిట్ల బాబు, ఉపాధ్యక్షులుగా మచ్చ ఆనందం, పిట్ల నర్సయ్య, కోశాధికారిగా తోక దేవదాస్, సంయుక్త కార్యదర్శులుగా పిడుగు విజయ్, వీరబోయిన రమేశ్, కార్యవర్గ సభ్యులుగా జజ్జరి రమేశ్, పర్శ రవి, చాత్రబోయిన బాలయ్య, బీమరి రాజు, రంగు దేవయ్య, గాడిచర్ల రాములు, పెరుమల్లి రమేశ్, శివంది లింగం, ముఖ్య సలహాదారులుగా దేవేందర్, ఓరుగంటి నర్సింలు, రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి



కోనరావుపేట: ప్రశ్నాపత్రం చూపుతున్న నాయకులు



వేములవాడ: పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కోనరావుపేట: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు టాలెంట్ టెస్టులు ఉపయోగపడుతాయని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపెల్లి కుమార్ అన్నారు. మండలకేంద్రంలోపది విద్యార్థులకు మంగళవారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పాఠ్యపుస్తకాలతో పాటు ఎన్నో అభ్యుదయ పుస్తకాలను చదవాలన్నారు. కార్యక్రమంలో కిరణ్, ప్రధానోపాధ్యాయుడు సాగర్, ఉపాధ్యాయులు కొండల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వేములవాడలో నిర్వహించిన టాలెంట్ టెస్టుకు స్పందన లభించింది. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, నాయకులు వేణు, మోహన్, ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మొదట ఎమ్ఎస్టీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు బాలకృష్ణ, టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ సభ్యులు సునితలు ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు, తదితరులు పేర్కొన్నారు.

అంత్యక్రియల్లో టెన్షన్ టెన్షన్

- భారీ పోలీస్ బందోబస్తు మధ్య లాస్య అంత్యక్రియలు

ముస్తాబాద్: అత్తింటి వేధింపులకు బలైన కొండుగారి లాస్య అంత్యక్రియలు నాటకీయ పరిణామాల మధ్య మంగళవారం రాత్రి జరిగాయి. మండలంలోని పోతుగల్‌కు చెందిన కొండుగారి లాస్య(25) ఆదివారం ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. లాస్య మరణానికి కారణమైన భర్త దేవరాజు, అత్తమామలు నర్సయ్య, వజ్రమ్మతోపాటు ప్రవీణ్, కల్యాణిపై చర్యలు తీసుకోవాలని మృతురాలి తండ్రి పంతం నాంపెల్లి, బంధువులు పెద్ద ఎత్తున పోతుగల్‌కు తరలివచ్చారు. రెండురోజులుగా సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలోనే లాస్య మృతదేహం ఉండగా.. ఆమె మృతికి కారణమైన వారిని అరెస్టు చేస్తామని ఎస్సై శేఖర్‌రెడ్డి హామీ ఇవ్వడంతో మంగళవారం పోస్టుమార్టం చేసేందుకు మృతురాలి తల్లిదండ్రులు అంగీకరించారు. పోతుగల్‌లోనే లాస్య అంత్యక్రియలు చేస్తామని నాంపెల్లి పేర్కొనడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. లాస్య భర్త దేవరాజు ఇంటి వద్ద పోలీసులు పెద్దఎత్తున మోహరించారు. అంబులెన్స్‌ను నేరుగా శ్మశానవాటికకు తీసుకెళ్లారు. అక్కడ లాస్య మామ నర్సయ్య చితికి నిప్పు పెట్టాడు. లాస్య తల్లిగారి ఊరైన గజసింగవరం నుంచి పెద్ద సంఖ్యలో బంధువులు తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న పండితులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను మంగళవారం వేదపండితులు ఘనంగా ప్రారంభించారు. ఈనెల 22 వరకు వేడుకలు నిర్వహించనున్నట్లు పండితులు తెలిపారు. మొదటి రోజు ఉదయం 9గంటలకు శాన్తిపాఠం, స్వస్తివాచనం, రుత్విగ్వరణం, యాగశాల ప్రవేశం, గణేశ, యో గిని, వాస్తు, నవగ్రహ, ప్రధాన కలశస్థాపన, సా యంత్రం గంటలకు కుండ సంస్కారం,అగ్నిప్రతిష్ఠ, జలాభిషేకం, పూజ, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. మోతే కిషన్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు రాచర్ల రఘురామశర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మాజీ సర్పంచులు నిమ్మ లక్ష్మీ, దొమ్మాటి నర్సయ్య, ఎంపీటీసీ అపెరా సుల్తాన, ఆలయ కమిటీ సభ్యులు లింగాల నర్సయ్య, నిమ్మ సుధాకర్ రెడ్డి, లద్దునూరి హన్మండ్లు, డాక్టర్ శ్రీధర్, సూర నర్సయ్య, నిమ్మ మల్లారెడ్డి, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు సాగు నీరందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

ముస్తాబాద్: చివరి ఆయకట్టు వరకు ఎగువమానేర్ ప్రాజెక్ట్ సాగునీరు అందించాలని మండలంలోని గూడెం రైతులు తహసీల్దార్‌కు మంగళవారం విజ్ఞప్తి చేశారు. గూడెం చివర ఉన్న పంటలకు నీరందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. కెనాల్‌లోకి చివరి ఆయకట్టు వరకు నీరు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక్కడ మాజీ ఎంపీటీసీలు ఎల్లాగౌడ్, శ్రీనివాస్‌రావు, రైతులు ఉన్నారు.

నేడు అవిశ్వాసం..

బోయినపల్లి(చొప్పదండి): ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్‌పై బుధవారం మండలప్రజాపరిషత్ కార్యాలయంలో వేములవాడ ఆర్డీవో మధుసూదన్ ఎదుట అవిశ్వాసం జరుగనుంది. గతనెల 27న ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటిస్తూ వరదవెల్లి, మల్లాపూర్, అనంతపల్లి, కోరెం, తడగొండ, నర్సింగాపూర్ ఎంపీటీసీలు ఈడుగు రాజేశ్వరి, ఐరెడ్డి గీత, కంకణాల వనజ, డబ్బు మమత, ఉయ్యాల శ్రీనివాస్, కొనుకటి నాగయ్య ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చిన విషయం తెలిసిందే. మండలంలో 11 ఎంపీటీసీ స్థానాలుండగా ఏడుగురు బీఆర్ఎస్, ఇద్దరు కాంగ్రెస్, మరో ఇద్దరు ఇండిపెండెంట్లు ఉన్నారు. అవిశ్వాసం నెగ్గాలంటే ఏడుగురు ఎంపీటీసీలు అవిశ్వాసానికి మద్దతు తెలపాల్సి ఉంటుందని తెలిసింది. కాగా ఆరుగురు ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానానికి గైర్హాజరు కానున్నట్లు సమాచారం. ఎంపీపీ వేణుగోపాల్, బోయినపల్లి, జగ్గారావుపల్లి, స్తంభంపల్లి, తడగొండ ఎంపీటీసీలు సంబ బుచ్చమ్మ, కొంకటి శిరీష, అక్కెనపెల్లి ఉపేందర్, ఉయ్యాల శ్రీనివాస్‌తో పాటు మరో ఎంపీటీసీతో కలిసి రెండ్రోజుల క్రితం క్యాంపుకు వెళ్లినట్లు సమాచారం. వీరంతా బుధవారం జరిగే అవిశ్వాస సమావేశానికి గైర్హాజరు కానున్నట్లు తెలిసింది

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఇసుక ట్రాక్టర్

- తప్పిన పెను ప్రమాదం
- ఆరుగంటల పాటు అంధకారం
- మరమ్మతు చేసిన సెస్ అధికారులు



ఎల్లారెడ్డిపేట: ఇసుక ట్రాక్టర్ల అతివేగం మరోసారి వివాదాస్పదమైంది. ఇసుక లోడ్‌తో వెళ్తున్న వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే మండలంలోని నారాయణపూర్ శివారులో మంగళవారం ఇసుక ట్రాక్టర్ అతివేగంగా వెళ్తూ.. విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో స్తంభం విరిగిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనూ ప్రమాదం తప్పింది. నారాయణపూర్‌కు చెందిన ఓ ట్రాక్టర్ మానేరువాగు నుంచి ఇసుకతో వేగంగా వచ్చి అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న స్తంభాన్ని ఢీకొట్టింది. స్తంభం విరిగిపోవడంతో సమీప రైతులు సెస్ అధికారులకు సమాచారం అందించడంతో వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో సుమారు ఆరుగంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయి నారాయణపూర్, బండలింగంపల్లి గ్రామాల ప్రజలు అంధకారంలో గడిపారు. సెస్ అధికారులు స్పందించి వి రిగిన స్తంభం స్థానంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి రాత్రి వరకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఇలా ఇసుక వాహనాలతో నిత్యం ఏదో ఒక రూపంలో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఇసుక రవాణాపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.